క్లుప్తంగా

పారిశుద్ధ్యంపై అవగాహన



మక్తల్: మండలంలోని పంచదేవ్‌పాడులో పారిశుద్ధ్యంపై శుక్రవారం గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. గ్రామాల్లో డ్రైయినేజీలను ఏర్పాటు చేయాలని, ఇండ్ల ముందు మురుగు లేకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు అధికారులను కోరారు. ఈ సందర్భంగా కార్యదర్శి మహేందర్ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కల్పన, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కులవృత్తులకు ప్రాధాన్యం



మక్తల్: సీఎం కేసీఆర్ కులవృత్తులకు ప్రాధాన్యం ఇస్తున్నారని బీఆర్‌ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి రాంలింగం అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. కులవృత్తుల వారికి రూ.లక్ష ఇచ్చేందుకు కేబినేట్ ఆమోదించడం సంతోషకరమన్నారు. సమావేశంలో శివారెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మక్తల్: పురుగు మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండలంలోని భగువాన్‌పల్లికి చెందిన శ్రీను (27), ఆయన భార్య అంకెన్‌పల్లి నర్సిరెడ్డి పొలం వద్ద కోళ్ల ఫారంలో పనిచేసేవారు. అప్పుడప్పుడు భార్యాభర్తల మధ్య చిన్నపాటి గొడవలు అయ్యేవి. గురువారం కోళ్లఫారంలో పురుగు మందు తాగాడు. గమనించిన భార్య జ్యోతి వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చింది. వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం మహబూబ్‌నగర్ తీసుకెళ్లగా, చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందినట్లు ఎస్‌ఐ పర్వతాలు తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. మృతుడికి ఒక పాప ఉంది.

తహసీల్దార్‌కు సన్మానం



నర్వ: తహసీల్దార్ బాధ్యతలు చేపట్టిన రాజగణేష్‌ను శుక్రవారం రేషన్‌డీలర్ అసోసియేషన్ సభ్యులు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. రేషన్ డీలర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకపోవాలని, సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు బాల్‌రాజు, గౌరవ అధ్యక్షుడు ఎల్ వెంకటయ్య, ఉపాధ్యక్షుడు ఉమాపతిరెడ్డి, కోశాధికారి జలంధర్, కార్యదర్శి నర్సిములు, డీలర్లు కల్యాణి, గంగమ్మ, మహేశ్వరీ, వెంకటేశ్వర్‌రెడ్డి, రాములు, కుర్మారెడ్డి, ఆనంద్‌రెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, బాలకిష్టన్న తదితరులు ఉన్నారు.

కోర్టులో మమత బెనర్జీకి చుక్కెదురు

నారాయణపేట రూరల్: ప్రేమ పేరుతో మత మార్పిడికి పాల్పడి అమ్మాయిల జీవితాలు నష్టపోతున్న ఉదంతంపై నిర్మించిన ది కేరళ స్టోరీ చిత్రం ప్రదర్శనను పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో అక్కడి ప్రభుత్వం నిషేధించింది. దీనిపై కోర్టుకు వెళ్లిన నిర్మాతలకు అనుకూలంగా కోర్టు స్టే వచ్చింది. చిత్ర ప్రదర్శన స్వేచ్ఛను అడ్డుకోవడం సరికాదని, తాత్కాలిక హింస సంఘటనలు చోటుచేసుకోకుండా తగిన నివారణ చర్యలు చేపట్టాల్సిన బాధ్యత అక్కడి ప్రభుత్వాలు తీసుకోవాలని తీర్పు ఇచ్చింది. ఈ తీర్పు మమతా బెనర్జీకి చెంపపెట్టు వంటిదని బీజేపీ నాయకుడు అడ్వకేట్ రఘువీర్ యాదవ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సేవా దృక్పథం అలవర్చుకోవాలి

ఊట్కూరు: సేవ దృక్పథం అలవర్చుకోవాలని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ఎల్కోటి జనార్దన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కంటి వైద్య శిబిరం నిర్వహించారు. మొత్తం 50 మందికి పరీక్షలు నిర్వహించగా 10 మందికి కంటి శుక్లాలు పరీక్షించారు. 10 మందికి ఆపరేషన్స్ కోసం మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. కార్యక్రమంలో రమేష్‌రావు, వంశీచందర్‌రెడ్డి, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు

ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి



మద్దూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

మద్దూరు: పూర్తిస్థాయిలో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తుందని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని దోరేపల్లి, మద్దూరు గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సివిల్ సప్లయ్ డీఎం హథిరావు, డీఎస్‌ఓ శివప్రసాద్‌రెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో సమస్యలను రైతులను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన మేర ధాన్యం మిల్లులకు తరలింపు కోసం లారీలను ఏర్పాటు చేయాలని డీఎంకు ఆదేశించారు. గన్నీ బ్యాగుల కొరత లేకుండా చూడాలని సూచించారు. అనంతరం మిల్లర్లు, అధికారులతో ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష నిర్వహించారు. రైతులను నుంచి సేకరించిన ధాన్యాన్ని మిల్లర్లకు సకాలంలో సరఫరా చేయాలని, అలాగే రైతులకు ఇబ్బంది పెట్టకుండా మిల్లర్లు ధాన్యం తీసుకోవాలని సూచించారు. బ్లాక్ లిస్టులో ఉన్న మిల్లులకు కూడా ధాన్యం పంపించే విధంగా చర్యలు తీసుకోవాలని, సీఎంఆర్, మిల్లుల సమస్యలపై కలెక్టర్‌కు ఎమ్మెల్యే ఫోన్ చేసి వివరించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. తెలంగాణ ఏర్పడి పదేళ్లు అయిన సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామన్నారు. మూడు వారాల పాటు ఉత్సవాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో ఎంఎంసీ చైర్మన్ వీరారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జగదీశ్వర్, సర్పంచ్ అరుణ, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి దినేష్, ఎంపీటీసీ వెంకటయ్య, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు మధుసూదన్, టీఆర్‌ఎస్ నాయకులు హన్మిరెడ్డి, రాజు, గోపాల్, చంద్రశేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, శివకుమార్ పాల్గొన్నారు.

కోస్గి: అభివృద్ధిలో దేశానికే తెలంగాణ ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు ప్రజలను మభ్యపెట్టే ప్రచారాలను మానుకోవాలన్నారు. వ్యవసాయం దండగా అన్న గత పాలకులకు కనువిప్పు కలిగించేలా రైతు బంధు, రైతుబీమా, ఉచిత కరెంట్ వంటి పథకాలు అమలు చేసి వ్యవసాయం పండుగ అని నిరూపించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. రానున్న ఎన్నికల్లో దమ్ముంటే తమపై రేవంత్‌రెడ్డి పోటీ చేసి గెలవాలని సవాల్ విసిరారు. కార్యక్రమంలో ఎంపీపీ మధుకర్ రావు, జెడ్పీటీసీ ప్రకాష్‌రెడ్డి, గ్రంథాలయ జిల్లా చైర్మన్ రామకృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ భీంరెడ్డి, వైస్ చైర్మన్ వేణుగోపాల్, మార్కెట్ కమిటీ చైర్మన్ వీరారెడ్డి, కౌన్సిలర్లు బాలేష్, మాస్టర్ శ్రీను, నాయకులు మ్యాకల రాజేష్, వెంకట్‌నర్సిములు, హన్మంతు, కిష్టయ్యతోపాటు పలువురు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం



రైతులతో మాట్లాడుతున్న నాయకులు

కోస్గి: రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను, రైస్ మిల్లులను జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులతో కలిసి తనిఖీ చేశారు. కొన్ని చోట్ల రైతులు గన్నీ బ్యాగులు ఇవ్వడం లేదని, మిల్లర్లు ఒక్కో సంచికి కిలోన్నర ధాన్యం తరుగు తీస్తున్నారని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచాలని ఎమ్మెల్యే జిల్లా అధికారులకు సూచించారు. రైస్ మిల్లులలో ధాన్యం నిల్వ చేసేందుకు స్థలం లేకపోవడంతో నాచారం సమీపంలోని ఓ మిల్లులో, కోస్గిలోని మరో కొత్త మిల్లులో ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో డీఎస్‌ఓ శివప్రసాద్ రెడ్డి, డీఎం హతీరాం, ఎంపీపీ మధుకర్ రావు, జెడ్పీటీసీ ప్రకాష్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ భీంరెడ్డి, వైస్ చైర్మన్ వేణుగోపాల్, మార్కెట్ కమిటీ చైర్మన్ వీరారెడ్డి, వైస్ చైర్మన్ వర ప్రసాద్, గ్రంథాలయ జిల్లా చైర్మన్ శ్యాసం రామకృష్ణ, కౌన్సిలర్లు బాలేష్, మాస్టర్ శ్రీను, నాయకులు రాజేష్, వెంకట్‌నర్సిములు, హన్మంతు, కిష్టప్పతోపాటు పలువురు పాల్గొన్నారు.

‘కంటివెలుగు’ను సద్వినియోగం చేసుకోవాలి



వర్కూర్‌లో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

మాగనూర్: మండలంలోని వర్కూర్ గ్రామ పంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరానికి గ్రామస్తుల నుంచి విశేష స్పందన లభిస్తోందని ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్య శిబిరాల వద్ద కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అవసరమైన వైద్య పరికరాలు, మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



మాగనూర్‌లో క్షీరాభిషేకం చేస్తున్న వీఆర్‌ఏలు

కృష్ణా: మంత్రి వర్గ సమావేశంలో వీఆర్‌ఏలకు పే స్కేల్ ప్రకటించడంతో తహసీల్దార్ కార్యాలయం ఎదుట కేసీఆర్ చిత్రపటానికి శుక్రవారం వీఆర్‌ఏల ఆధ్వర్యంలో క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడు మచ్చేందర్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ వీఆర్‌ఏల సమస్యల పరిష్కారానికి సానుకూలంగా నిర్ణయం తీసుకోవడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో వీఆర్‌ఏలు మహాదేవ్, మహేష్, రాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

మాగనూర్: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం సీఎం కేసీఆర్ చిత్రపటానికి వీఆర్‌ఏలు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఒకరికొకరు స్వీట్లు పంచుకొని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వీఆర్‌ఏలు సత్యనారాయణ, గీతాబాయి, మాధవి, మహిపాల్ రెడ్డి, వెంకటేష్, ఆంజనేయులు, సందీప్, అశోక్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కోస్గి: రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో వీఆర్‌ఏలకు స్కెల్ వర్తింపజేస్తూ నిర్ణయించడంపై వీఆర్‌ఏలు



కృష్ణా మండలంలో..

సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో వీఆర్‌ఏలు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వీఆర్‌ఏలు హన్మంతు, రాఘవేందర్, నర్సిములు, శ్రీనివాస్, కవిత, పాండు, పద్మాతోపాటు పలువురు పాల్గొన్నారు.

ఊట్కూరు: మండల తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో వీఆర్‌ఏల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో వీఆర్‌ఏలు వెంకటేష్, అరుంధతి, భీంరావు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పోరాట ఫలితమే క్రమబద్ధీకరణ

నారాయణపేట టౌన్: వీఆర్‌ఏల క్రమబద్ధీకరణ కార్మిక సంఘాలు, పార్టీల పోరాట ఫలితమే అని సీఐటీయూ జిల్లా కన్వీనర్ బలరాం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వీఆర్‌ఏలను క్రమబద్ధీకరించేందుకు క్యాబినెట్ నిర్ణయం తీసుకోవడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. దీనిపై వేగంగా చర్యలు తీసుకొని వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరించాలని కోరారు. అందుకు సంబంధిత జీఓ, ప్రభుత్వ ఉత్తర్వులు త్వరగా విడుదల చేయాలన్నారు.

‘జీఓ 69 అమలు చేయాలి’

నారాయణపేట రూరల్: జిల్లా ప్రజలకు తాగునీరు, రైతులకు సాగునీరు అందించేందుకు జీఓ 69ని అమలు చేయాలని జల సాధన సమితి కో కన్వీనర్ నర్సింహ డిమాండ్ చేశారు. నాడు ఉమ్మడి రాష్ట్రంలో గవర్నర్ పాలనలో ఇచ్చిన జీఓను టీఆర్‌ఎస్ ప్రభుత్వం తొక్కి పెట్టిందని, పాలమూర్-రంగారెడ్డి ఎత్తిపోతలను తెరమీదకు తెచ్చి జిల్లా ప్రజలను మోసం చేస్తుందని ఆరోపించారు. మిగులు జలాలతో లాభం చేకూర్చకుండా వరద జలాలపై ఆధారపడి నీళ్లు రాక రైతుల ఆత్మహత్యలు, వలసలు పెరుగుతాయన్నారు. కాళ్ల దగ్గర మక్తల్ నుంచి వెళ్తున్న కృష్ణమ్మ పరుగులు పెడుతుంటే.. శ్రీశైలం నుంచి నీటిని వెనక్కి తెస్తామని చెప్పడం సరికాదన్నారు. ఈ నెల 23న స్థానిక స్వామి వివేకానంద మున్సిపల్ పార్క్ వద్ద జరిగే నిరసన దీక్షకు రైతులు, మేధావులు, విద్యార్థులు తరలిరావాలని కోరారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

మాగనూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్ళే మార్గంలో ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. తక్కువ ఎత్తులో ఏర్పాటు చేయడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని ప్రయాణికులు, ఆస్పత్రికి వచ్చే రోగులు భయాందోళనకు గురవుతున్నారు. చిన్నారులకు చేతికందే ఎత్తులో ఉండటంతో తల్లిదండ్రులు బయటికి పంపించేందుకు జంకుతున్నారు. విద్యుత్ అధికారులు నిర్లక్ష్యం వీడి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎత్తులో ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.



తక్కువ ఎత్తులో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్

పంటల సాగులో సస్యరక్షణ చర్యలు



మాట్లాడుతున్న ఏఓ అరవింద్

దామరగిద్ద: వానాకాలం సీజన్ సమీపిస్తున్నందున తొలకరి వర్షాలకు దుక్కులు సిద్ధం చేసుకోవడం, జీలుగ, జనుము వంటి పచ్చిరొట్ట సాగు, విత్తన శుద్ధి వంటి సస్యరక్షణ చర్యలు పాటించి పంటలను సాగు చేసుకోవాలని ఏఓ అరవింద్ అన్నారు. శుక్రవారం మండలంలోని పిడెంపల్లిలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీలుగ సాగుతో సహజసిద్ధ పోషకాలు పెరిగి నేల సారవంతమవుతుందన్నారు. పంటల సాగుకు ముందు లోతు దుక్కులు చేసుకోవడం ద్వారా ఎండ తీవ్రతకు నేలలోని చీడపడలు నాశనం అవుతాయన్నారు. ప్రధానంగా విత్తనాల ఎంపికలో జాగ్రత్త వహించాలని, అధిక దిడుబడినిచ్చే హైబ్రీడ్ విత్తనాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ వీరమ్మ, నాయకులు వీరప్ప, మహిపాల్, వీరారెడ్డి రైతులు పాల్గొన్నారు.

రాకొండ ఘటనపై మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు



ఫిర్యాదు పత్రాన్ని చూపిస్తున్న బీఎస్పీ నాయకులు

మరికల్: మండలంలోని రాకొండ శివారులో ఉన్న కోయిల్‌సాగర్ ఊకచెట్టు వాగులో తవ్విన ఇసుక గుంతలో పడి ముగ్గురు బాలికలు మృతి చెందిన ఘటనపై శుక్రవారం బీఎస్పీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో మానవ హక్కుల కమీషన్‌కు ఫిర్యాదు చేశారు. రాకొండలో రాజకీయ పార్టీలకు చెందిన కొందరు నాయకులు ఊకచెట్టు వాగులో అక్రమంగా ఇసుకను తరలించేందుకు ఇష్టానుసారంగ గుంతలను తవ్వడం వల్లే ఈతకు వెళ్లిన ముగ్గురు బాలికలు అందులో పడి మృతువాత పడ్డారని మానవ హక్కుల కమీషన్‌కు తెలిపినట్లు బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జీ శ్రీనివాస్ బాధిత కుటుంబ సభ్యులతో కలిసి విన్నవించారు. ఇసుక గుంతలను తవ్విన వారిపై కఠినమైన కేసులు నమోదు చేసి, బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

సీనియర్ మేటీలను ఫీల్డ్ అసిస్టెంట్లుగా గుర్తించండి

అమరచింత: ఉపాధి హామీ పథకంలో సీనియర్ మేటీలుగా కొనసాగుతున్న వారికి ఫీల్డ్ అసిస్టెంట్లుగా ప్రభుత్వం గుర్తించాలంటూ వ్యవసాయకార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఎంపీడీఓ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందించారు. ఈ మేరకు ఆసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఉపాధి కూలీల వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో 20 పనులు మాత్రమే చేయాలన్న నిబంధనలను ఎత్తివేయాలన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్, రమేష్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

జీలుగ సాగుతో నేల సారవంతం

ధన్వాడ: మండల కేంద్రంలోని ఆగ్రోస్ కేంద్రంలో మండల వ్యవసాయశాఖ అధికారి ప్రదీప్‌కుమార్, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతులకు జీలుగ విత్తనాలు అందజేశారు. ప్రభుత్వం సబ్సిడీపై విత్తనాలను పంపిణీ చేస్తుందని, మార్కెట్‌లో క్వింటాల్‌కు రూ.2,800 ఉండగా సబ్సిడీపై రూ.842 అందజేస్తున్నట్లు ఏఓ తెలిపారు. ప్రస్తుతానికి మండలానికి 100 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో రామకిష్టాయిపల్లి సర్పంచ్ మాధవరెడ్డి, పేట మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొండారెడ్డి, ఎంపీటీసీ సుధీర్‌కుమార్, నాగేశ్వరెడ్డి, చంద్రశేఖర్, మురళీధర్‌రెడ్డి, పటేల్ నర్సిములు, శ్రీనివాస్‌రెడ్డి, నారాయణస్వామి తదితరులు ఉన్నారు.



జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు, నాయకులు

ఉపాధి హామీ కూలి రేట్లు పెంచాలి

నారాయణపేట రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు గిట్టుబాటు అయ్యే విధంగా కూలి రేట్లు పెంచాలని ఏఐపీకేఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్రాములు డిమాండ్ చేశారు. మండలంలోని చిన్నజట్రంలో జరుగుతున్న ఉపాధి పనులను శుక్రవారం పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే చట్టాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. పెండింగ్ వేతనాలు అందించి, మేటీలకు పారితోషికం ఇవ్వాలన్నారు. ఇన్సురెన్స్, సేఫ్టి కిట్, పనిముట్లు, కనీస సౌకర్యాలపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. గతంలో 82 రకాల పనులు చేయిస్తుండగా వాటిని కుదించి 22 రకాల పనులు మాత్రమే అనుమతులు ఇస్తున్నారని వాపోయారు. కార్యక్రమంలో హాజిమలాంగ్, ప్రశాంత్, నర్సింహులు, నరేష్ పాల్గొన్నారు.



కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

ఆలయాలకు రూ.10 లక్షల విరాళం

మక్తల్: మండలం కర్నిలో ఉన్న ఆలయాలకు మత్స్య సహకార సంఘం ఆధ్వర్యంలో రూ.10 లక్షలు విరాళంగా ప్రకటించారు. ఇందులో భాగంగా ముందుగా శుక్రవారం గుంటి రంగ స్వామి కల్యాణ మండపం కోసం రూ.2.50 లక్షలు, లింగమయ్య రూ.2.50 లక్షలు అందజేశారు. అనంతరం మత్స్యశాఖ అధ్యక్షుడు నర్సింహను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రంగప్ప, ఉప సర్పంచ్ పట్నం బాలయ్య, చిన్నతాయప్ప, గోపాల వెంకటప్ప, లక్ష్మయ్య, శాంతప్ప, ఆలయ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, కృష్ణయ్యగౌడ్, హన్మంతు, దండుశ్రీను, పాండయ్య తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న మచ్చ ప్రభాకర్

ధన్వాడ: మండల కేంద్రంలోని భక్త మార్కండేయ స్వామి ఆలయంలో పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మచ్చ ప్రభాకర్‌ను ఆసంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సభ్యత్వ నమోదు కార్యాక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పద్మశాలీల సభ్యత్వ నమోదుతోనే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవడానికి వీలు కలుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో రాజకీయ పార్టీలు పద్మశాలీలను కేవలం ఓటు బ్యాంక్‌గానే చూస్తున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, ఎంపీటీసీ మాధవి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉదయభాను, మండల అధ్యక్షుడు కెంచె బాల్‌రాజు, యువజన సంఘం అధ్యక్షుడు మాకం వీరేష్‌కుమార్, కార్యదర్శి శ్రీనివాసులు, వెంకట్రాములు, బాలప్ప, సురేందర్, జయప్రకాష్, శివాజీ, రాము, వెంకట్రాములు, నర్సిములు, భాస్కర్ తదితరులు ఉన్నారు.

ఆలయాల్లో అమావాస్య పూజలు

నారాయణపేట రూరల్: జిల్లా వ్యాప్తంగా శైవక్షేత్రాల్లో శుక్రవారం అమావాస్య పూజలు ఘనంగా జరిగాయి. రాష్ట్రాల సరిహద్దులోని కాలబెలగుంది క్షేత్రంలో స్వామివారికి సుప్రభాతం, రుద్రాభిషేకం, బిల్వార్చన, అష్టోత్తరనామావళి, అభిషేకం, అలంకరణ, హారతి తదితర పూజలు నిర్వహించారు. భక్తులకు సర్వదర్శనం కల్పించి అన్నదానం చేపట్టారు. అదే విధంగా పట్టణంలోని అయ్యప్పస్వామి, సింగార్‌బేస్ శివలింగేశ్వర స్వామి ఆలయం, మహంకాళి వీధి శివాలయం, తాయమ్మగుడితో పాటు మండలంలోని ఎక్లాస్‌పూర్ తిమ్మప్ప ఆలయం, జిలాల్‌పూర్ కర్రెప్పతాత గుడిలో ప్రత్యేక పూజలు చేసి భక్తులకు అన్నదానం చేపట్టారు.



ప్రత్యేక అలంకరణలో కాలబెలగుందీశ్వరుడు

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

మక్తల్: నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని సీఐ సీతయ్య అన్నారు. శనివారం పట్టణంలో ఫర్టిలైజర్ దుకాణాలను వ్యవసాయ అధికారి మిథిన్‌చక్రవర్తి, ఎస్‌ఐ పర్వతాలు తనిఖీ చేశారు. రికార్డులను, స్టాక్ రిజిస్టర్, బిల్ బుక్కులను పరిశీలించారు.

ఉద్యమం ఉధృతం చేస్తాం

నారాయణపేట రూరల్: వెనకబడిన ప్రాంతమైన కోటకొండపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని బీజేపీ జిల్లా నాయకుడు కెంచె శ్రీనివాసులు ఆరోపించారు. మండలంగా ఏర్పాటు చేయాలని కోటకొండలో నిర్వహిస్తున్న రిలేదీక్షలు శుక్రవారం 10వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా తిర్మలాపూర్ బీజేపీ నాయకులు దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని అవకాశాలు ఉన్న కోటకొండను మండలం చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. విద్య, వైద్యం తదితర విషయాల్లో హైస్కూల్, పీహెచ్‌సీలు ఎన్నో ఏళ్లుగా నడుస్తున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఉత్తమ్ రెడ్డి, బాలకిష్టప్ప, సుదర్శన్‌గుప్తా, కళ్యాణంవీరణ్ణ, చెంచుగోవిందు, రాజు, వెంకటేష్, సిద్ధార్థ, వెంకటేష్, భాస్కర్, మోనయ్య, బీష్మాచారీ, సుభాన్‌రెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కెంచె శ్రీనివాస్

పారిశుద్ధ్యంపై అవగాహన

కోస్గి: ఈ నెల 19వ తేదీ నుంచి 27వ తేదీ వరకు వారం రోజులపాటు నిర్వహించే స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌పై శుక్రవారం మున్సిపల్ కార్మికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మున్సిపల్ కమిషనర్ శశిధర్ కార్మికులకు పలు సూచనలు చేశారు. విధివిధానాలను సమగ్రంగా వివరించారు. కార్యక్రమంలో మేనేజర్ శంకర్ నాయక్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ విజయ్ భాస్కర్, నాయికోటి వెంకటయ్య, సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ అధికారులు

మొక్కులు చెల్లించుకున్న కాంగ్రెస్ నాయకులు

నర్వ: కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించడంతో ఆ పార్టీ నాయకులు స్వామివారిని దర్శించుకున్నారు. శుక్రవారం మండల నాయకుల ఆధ్వర్యంలో కురుమూర్తి స్వామి దేవాలయం వద్ద టెంకాయలు కొట్టి తమ మొక్కులను చెల్లించుకున్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు వాకిటి శ్రీహరి, మక్తల్ నియోజకవర్గ నాయకులు ఎన్‌ఆర్‌ఐ పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు చెన్నయ్యసాగర్, తులిసిరాజ్, నాయకులు శరణప్ప, వివేకవర్ధన్‌రెడ్డి, అయుబ్‌ఖాన్, రహమతుల్లా, గంగాధర్, సుదర్శన్‌గౌడ్, డీజే చెన్నయ్య, బుడ్డన్న, కట్ట వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

వందశాతం మొక్కలు నాటాలి

మరికల్: వానాకాలంలో ప్రారంభించే హరితహారంలో వందశాతం లక్ష్యం సాధించేందుకు నర్సరీలో పెరుగుతున్న మొక్కలను సిద్ధంగా ఉంచాలని డిప్యూటీ రేంజ్ అధికారి రఘునాథ్‌రెడ్డి అన్నారు. మండలంలోని జిన్నారం నర్సరీని శుక్రవారం పరిశీలించారు. జిల్లాలో ప్రతి నర్సరీలో 50 వేల మొక్కలను పెంచుతున్నట్లు తెలిపారు. వీటిని వర్షాలు ప్రారంభం కాగానే నాటేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మొక్కలకు ఎరువులు వేసి త్వరగా పెరిగేలా చర్యలు తీసుకోవాలని నర్సరీ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో రేంజ్ అధికారి నారాయణరావు, బీట్ అధికారి నవీన్ పాల్గొన్నారు.



జిన్నారం నర్సరీని పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు